వేసవి క్రీడా శిక్షణ శిబిరాల
దరఖాస్తు గడువు పెంపు

కరీంనగర్ స్పోర్ట్స్, మే 8 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్, జిల్లా యువజన క్రీడాశాఖల ఆధ్వర్యంలో ఈ నెల 12న నుంచి ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను నిర్వహించనున్నామని డీవైఎస్‌వో వి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. 6 నుంచి 18 సంవత్సరాల్లోపు బాలబాలికలు తమ దరఖాస్తులను ఈ నెల 11న సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. గతంలో 9వ తేదీ వరకే దరఖాస్తులను అందించాలని తెలిపినప్పటికీ విద్యార్థులు, క్రీడాకారులకు అనువుగా ఉండేందుకు గడువును పొడిగించామన్నారు. దరఖాస్తుకు ఆధార్‌కార్డు జిరాక్స్, ఒక పాస్‌ఫోర్టు సైజ్ ఫొటో అతికించి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలోని యువజన క్రీడాశాఖ కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. ఆర్చరీ, అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్, కరాటే, ఖో-ఖో, బాస్కెట్‌బాల్, కబడ్డీ, ఫుట్‌బాల్, వాలీబాల్, హాకీ, రెజ్లింగ్, జూడో, చెస్, సాఫ్ట్‌బాల్, యోగా, క్రికెట్ అంశాల్లో ఉచిత శిక్షణ అందించనున్నామన్నారు.

నిరుద్యోగులకు ఉపాధి శిక్షణ

సుభాష్‌నగర్, మే 8 (ఆంధ్రజ్యోతి): నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్) ఆధ్వర్యంలో మూడు నెలల ఉపాధి శిక్షణ అందించనున్నట్లు న్యాక్ డైరెక్టర్ జి రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ల్యాండ్ సర్వే, కన్‌స్ట్రక్షన్, ఎలక్ట్రీషియన్ కోర్సుల్లో శిక్షణ అందించి ప్రైవేటు రంగాల్లో ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. కోర్సులకు 14,700 ఫీజును చెల్లించాలని తెలిపారు. 18 సంవత్సరాల నుంచి 35 సంవత్సరాలు శిక్షణకు అర్హులన్నారు. వివరాలకు ఆర్‌అండ్‌బీ ఎస్ఈ కార్యాలయం ఆవరణలోని న్యాక్ సెంటర్‌లోగాని, 9440462346, 9849801074 నంబర్లలోగాని సంప్రదించాలని సూచించారు.

పడిపోతున్న భూగర్భ జలాలు



- నెలరోజుల్లో రెండు మీటర్ల లోతుకు..
- చొప్పదండిలో 16.64 మీ, గంగాధరలో 16.62 మీటర్లలో నీరు
- జిల్లా సగటు 9.02 మీటర్లు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)


ఎండలు మండిపోతుండడంతో భూగర్భ జలాలు వేగంగా అడుగంటు తున్నాయి. మార్చితో పోల్చితే ఒక్క నెలలోనే సగటున రెండు మీటర్ల లోతుకు భూగర్భ జలాలు పడిపోయాయి. జిల్లాలో గత మూడు రోజులు మినహా మిగతా రోజుల్లో 43 నుంచి 46 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతూ వస్తున్నది. కరీంనగర్‌తోపాటు పలు గ్రామాలకు తాగునీటి వనరు అయిన లోయర్ మానేరు డ్యాంలో నీటిమట్టం కనీస స్థాయికి పడిపోయే స్థితికి వచ్చింది. మిడ్ మానేరు నుంచి నీటిని వదలడంతో తాగునీటి ఇబ్బంది తప్పింది. డ్యాం పూర్తి స్థాయి సామర్థ్యం 24.03 టీఎంసీలకు ప్రస్తుతం 6.93 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది. డెడ్ స్టోరేజీ లెవల్ 2.5 టీఎంసీలకు వస్తే తాగునీటికి ఇబ్బంది ఏర్పడుతుంది.

రోజురోజుకు.. ఆందోళనకరంగా..

జిల్లాలో మార్చితో పోల్చితే ఏప్రిల్ మాసాంతానికి ఇల్లందకుంట మండలంలో 2.84 మీటర్ల లోతుకు నీరు పడిపోయింది. కరీంనగర్ అర్బన్ మండలంలో 2.22 మీటర్లు, చొప్పదండిలో 2.17 మీటర్ల లోతుకు నీరు పడిపోయి ప్రజలకు ఆందోళన కలిగిస్తున్నది. ప్రస్తుతం జిల్లాలో చొప్పదండిలో 16.64 మీటర్ల లోతున, గంగాధరలో 16.62 మీటర్ల లోతున, కరీంనగర్ అర్బన్ మండలంలో 12.82 మీటర్ల లోతున, గన్నేరువరంలో 9.63 మీటర్లు, కొత్తపల్లిలో 9.53 మీటర్ల లోతున నీరు లభిస్తున్నది. హుజూరాబాద్ మండలంలో 9.51 మీటర్లు, తిమ్మాపూర్‌లో 9.32 మీటర్లు, చిగురుమామిడి మండలంలో 8.13 మీటర్లు, సైదాపూర్‌లో 7.80 మీటర్లు, ఇల్లంద కుంటలో 6.17 మీటర్లు, కేశవపట్నంలో 6.16 మీటర్లు, కరీంనగర్ రూరల్ మండలంలో 5.46 మీటర్లు, జమ్మికుంటలో 4.69 మీటర్లు, వీణవంకలో 4.41 మీటర్లు, మానకొండూర్‌లో 4.21 మీటర్ల లోతున నీరు లభ్యమవుతున్నది. మార్చితో పోల్చితే ఏప్రిల్‌లో నీటి వినియోగం తగ్గింది. వ్యవసాయ అవసరాలకు నీటి వినియోగం తగ్గినా భూగర్భ జలాలు అడుగంటుతుండడంతో రానున్న రోజుల్లో తాగునీటికి ఇబ్బందులు వచ్చే పరిస్థితి కనిపిస్తున్నది.

జల వనరుల్లో తగ్గుతున్న నీరు

జల వనరులలో నీటి నిల్వలు తగ్గిపోతుండడంతో మిషన్ భగీరథకు ఇబ్బంది తప్పదేమో అనే ఆందోళన వ్యక్తమవుతున్నది. కరీంనగర్‌లో భూ గర్భ జలాలు అడుగంటి పోతుండడంతో బోరుబావులు ఎండిపోతున్నాయి. ఇప్పటికే అపార్ట్‌మెంట్లలో, విద్యానగర్ లాంటి ఎగువ ప్రాంతాల్లో బోర్లు అడుగంటిపోయాయి, కరీంనగర్ అర్బన్ మండలంలో 12.82 మీటర్ల లోతుకు నీరు పడిపోయింది. గత నెలలో 10.60 మీటర్ల లోతున నీరు లభ్యం కాగా ఇప్పుడు అది 12.82కు పడిపోవడంతో బోర్లు వట్టిపోతున్నాయి.



ఎల్‌ఎండీలో తగ్గిన నీరు (ఫైల్)

దేశ భద్రత కోసం కేంద్రానికి సహకరిస్తాం

మంత్రి పొన్నం ప్రభాకర్



సుందరగిరిలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

చిగురుమామిడి, మే 8 (ఆంధ్రజ్యోతి): దేశ భద్రత కోసం రాజకీయాలకు అతీతంగా కేంద్ర ప్రభుత్వానికి సహకరిస్తామమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. గురువారం మండలంలోని సుందరగిరి వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంత్రి జన్మదినం సందర్భంగా ప్రత్యేక పూజాలు చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ భారత సైనికుల ధైర్యసాహసాలకు దేశ వ్యాప్తంగా ప్రశంసలు లభిస్తున్నాయన్నారు. పాకిస్థాన్ ఎన్ని కవ్వింపు చర్యలకు పాల్పడినా మన సైనికులు తిప్పి కొట్టడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకునే ఎలాంటి నిర్ణయానికైనా తమ పార్టీ మద్దతు తెలుపుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, హస్‌ఫెడ్ మాజీ చైర్మన్ బొమ్మ శ్రీరామ్‌చక్రవర్తి, బొలిశెట్టి శివయ్య, చిట్టుమల్ల రవీందర్, చిట్టుమల్ల శ్రీనివాస్, గీకురు రవీందర్, ఐరెడ్డి సత్యనారాయణరెడ్డి, వంగర మల్లేశం, వడియాల సుధకర్‌రెడ్డి, ఎలగందుల లక్ష్మణ్, కోణేటి రాములు, మేకల పర్శరాములు, సంపత్‌రెడ్డి పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయ నిర్మాణం
పూర్తికావాలని కోరుకున్నా

మాజీ మంత్రి గంగుల కమలాకర్



తిరుపతిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్

తిరుమల, మే 8 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో శ్రీవారి ఆలయ నిర్మాణం త్వరలో పూర్తికావాలని కోరుకున్నానని మాజీ మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. తిరుమల శ్రీవారిని గురువారం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్ శ్రీవారి ఆలయ నిర్మాణం కోసం కరీంనగర్‌లో 10 ఎకరాల భూమిని కేటాయించగా ఆలయానికి సంబంధించిన భూమిపూజ జరిగిందన్నారు. ఈక్రమంలో స్వామి అనుగ్రహంతో ఆ ఆలయ నిర్మాణం త్వరగా పూర్తికావాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. శ్రీవేంకటేశ్వర స్వామి తమ కుల దైవమని, ఏడాదిలో నాలుగైదుసార్లు తిరుమలకు వచ్చి దర్శనం చేసుకుంటానన్నారు. ప్రత్యేకించి తన జన్మదినం రోజు స్వామి ఆశీస్సులు పొందడం ఆనవాయితీగా మారిందన్నారు. ఇందులో భాగంగానే తన 57వ పుట్టినరోజు సందర్భంగా శ్రీవారిని దర్శించుకున్నట్టు చెప్పారు. స్వామిని నమ్ముకున్నవారికి ఎప్పటికీ అన్యాయం జరగదన్నారు. ప్రతీ ఒక్కరు భక్తిమార్గంలోనే నడవాలని కోరుకుంటున్నానన్నారు.

హోంగార్డుల బదిలీలకు
రంగం సిద్ధం



పెద్ద ఎత్తున పైరవీలు..?

కరీంనగర్ క్రైం, మే 8 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్న హోంగార్డుల బదిలీలకు పెద్ద ఎత్తున పైరవీలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. జిల్లాల పునర్విభజన జరిగి కొత్త జిల్లాల ఏర్పాటు సమయంలో కరీంనగర్ హెడ్ క్వార్టర్స్‌గా పని చేసిన హోంగార్డులను తాత్కాలిక పద్ధతిన ఏడు జిల్లాలకు బదిలీ చేశారు. ఆ సమయంలో స్థాని కత, సీనియారిటీ చూడకుండా ఇష్టాను సారంగా బదిలీ చేయడంతో జిల్లాకు చెందిన చాలా మంది హోం గార్డులు ఇతర జిల్లాలకు వెళ్లారు. వారు విధులు నిర్వహించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తమను సొంత జిల్లాలకు బదిలీ చేయాలని హోంగార్డులు పలుమార్లు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నారు. వారి సమస్యలు పరిష్కారం కాలేదు.

గత పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతిని కలిసిన హోంగార్డులు వారి సమస్య పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఆయన హోంగార్డు విభాగం ఐజీకీ లేఖ రాశారు. ఉమ్మడి జిల్లాలో హోం గార్డుల ఐజీ బదిలీలకు అనుమతి ఇచ్చినట్లు తెలిసింది. ఈ మేరకు 10 రోజులు హోంగార్డుల బదిలీలకు కసరత్తు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఈ బదిలీలకు పెద్ద ఎత్తున పైరవీలు జరుగుతున్నాయని సమాచారం. కరీంనగర్ హోంగార్డుల విభాగం అధికారి ఒకరు పైరవీలకు తెర లేపినట్లు హోం గార్డులు చర్చించుకుంటున్నారు. ప్రస్తుతం ఇతర జిల్లాలలో పనిచేస్తూ కరీంనగర్ జిల్లాకు బదిలీ చేయించుకునేందుకు సదరు అధికారిని ప్రసన్నం చేసుకుంటున్నారని సమాచారం. ఇలా ఆ అధికారిని ప్రసన్నం చేసుకున్న వారికే కరీంనగర్‌కు బదిలీలు జరిగే అవకాశముందని తెలుస్తోంది. మరోవైపు కరీంనగర్‌లో పని చేస్తున్న హోం గార్డులను ఇతర జిల్లాలకు బదిలీ చేసేందుకు కసరత్తు జరుగుతున్నట్లు సమాచారం. హోం గార్డుల బదిలీల్లో సీనియారిటీ ప్రాతిపదికన, పదవీ విరమణకు దగ్గరగా ఉన్న వారికి అవకాశం ఇవ్వాలని హోంగార్డులు కోరుతున్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఐవో డాక్టర్ సాజిద, ఉమాశ్రీ

తలసేమియాపై
అవగాహన కల్పించాలి

సుభాష్‌నగర్, మే 8 (ఆంధ్రజ్యోతి): తలసేమియా వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ సాజిద అన్నారు. అంతర్జాతీయ తలసేమియా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సాజిత మాట్లాడుతూ తలసేమియా అనేది తల్లిదండ్రుల నుంచి పిల్లలకు సంక్రమించే రుగ్మత అని తెలిపారు. ఈ వ్యాధి, చికిత్స గురించి ప్రజలకు తెలియచేయడం కోసం ప్రతిసంవత్సరం మే 8న తలసేమియా దినోత్స వాన్ని నిర్వహిస్తుంటారని అన్నారు. ఈ వ్యాధి వచ్చినవారు తీవ్ర రక్తహీనత కలిగి ఉంటారని తెలిపారు. తలసేమియా కోసం కలిసి సమాజాన్ని ఏకం చేయడం ఈ సంవత్సరం థీమ్ అని తెలిపారు. కార్యక్ర మంలో పీడీడీటీ ఉమాశ్రీ, ఎంసీహెచ్‌పీవో డాక్టర్ సనజవేరియా, డెమో రాజగోపాల్, ఏవో ఖాదర్, డీపీవో స్వామి పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుల్లో
349 దరఖాస్తులు

సైదాపూర్, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎక్లాస్‌పూర్, రాయికల్ గ్రామాల్లో బుధ, గురువారాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో భూ సమస్యలపై 349 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ గుర్రం శ్రీనివాస్ తెలిపారు. రెండురోజులు నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో రాయికల్ గ్రామంలో 215, ఎక్లాస్‌పూర్ గ్రామంలో 134 దరఖాస్తులు వచ్చాయన్నారు. శుక్రవారం రాంచంద్రాపూర్, వెన్కేపల్లి గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రెవెన్యూ సదస్సుల్లో అర్జీలు సమర్పించి భూభారతి చట్టం ద్వారా రైతుల సమస్యలు పరిష్కార చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో రమేష్‌బాబు, తహసీల్దార్ కనకయ్య పాల్గొన్నారు.


అభివృద్ధికి నోచుకోని గ్రామాలు



యాస్వాడ గ్రామం

యాస్వాడ, గోపాల్‌పూర్ గ్రామాలకు మట్టిరోడ్డే దిక్కు

కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్న గ్రామ ప్రజలు



యాస్వాడ గ్రామానికి వెళ్లే మట్టి రోడ్డు.

గన్నేరువరం, మే 8 (ఆంధ్రజ్యోతి): గన్నేరువరం మండలంగా ఏర్పడి ఎనిమిది సంవత్సరాలు దాటినా మండలంలోని యాస్వాడ, గోపాల్‌పూర్ గ్రామాలు అభివృద్ధికి నోచుకోవడం లేదు. ఈ గ్రామాలకు వెళ్లడానికి బీటీ రోడ్డు లేదు. ఇరుకైన మట్టి రోడ్డుతో వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ గ్రామాలకు ఇప్పటి వరకు బస్సు సౌకర్యం లేదు. ఆటోలు, ద్విచక్ర వాహనాలే వారికి దిక్కు.

గోపాల్‌పూర్ గ్రామంలో 120 ఇళ్లు, 400 మంది జనాభా ఉండగా గ్రామంలోని పలు వీధుల్లో సీసీ రోడ్లు కూడా లేవు. గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు లేక పోవడంతో గతంలోనే మూతపడింది. ఇప్పటి కైనా జంగపల్లి ఎక్స్ రోడ్ గ్రామానికి బీటి రోడ్డు వేయాలని సర్పంచ్‌తో పాటు గ్రామస్థులంతా కోరుతున్నారు.

మౌలిక వసతులు కరువు

అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న మరొక గ్రామం యాస్వాడ. మండల కేంద్రానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న మారుమూల గ్రామం అయిన యాస్వాడను నూతన గ్రామపంచాయతీగా ఏర్పాటు చేశారు. గ్రామానికి నేటికీ బీటి రోడ్డు లేదు. బస్సు సౌకర్యం లేదు. అంగన్‌వాడీ కేంద్రం లేదు, ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం లేదు.

గ్రామపంచాయతీ కార్యాలయాన్ని ప్రాథమిక పాఠశాల భవనంలో కొనసాగిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో మండల కేంద్రానికి వెళ్లడానికి ద్విచక్ర వాహనాలే దిక్కు. వర్షాకాలం వచ్చిందంటే గ్రామానికి వెళ్లే మట్టి రోడ్డు బురదమయంగా మారి రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామ పంచాయతీకి భవనం లేదు. యాస్వాడ గ్రామం మానేరు డ్యాంను ఆనుకొని ఉంటుంది. మండల కేంద్రం నుంచి మత్స్యకారులు ప్రతిరోజు ఉదయం, సాయంత్రం డ్యాంలో చేపలు పట్టేందుకు యాస్వాడకు వస్తుంటారు. మట్టిరోడ్డుపై వచ్చేందుకు వారు ఇబ్బందులు పడుతున్నారు.



గోపాల్‌పూర్ గ్రామానికి వెళ్లే ఇరుకైన మట్టిరోడ్డు



గోపాల్‌పూర్‌లో శిథిలమైన ప్రభుత్వ పాఠశాల

పరీక్ష..ప్రశ్నార్థకం

- 'శాతవాహన'లో గందరగోళ పరిస్థితి
- ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోతే పరీక్షలు నిర్వహించలేమని తేల్చిచెప్పిన ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు
- గడువు ముగిసినా పరీక్ష ఫీజులు చెల్లించని వైనం
- ఆందోళనలో డిగ్రీ విద్యార్థులు

6

కల్వర్టును ఢీకొన్న కారు.. ఒకరి మృతి

- మరొకరికి తీవ్రగాయాలు

మానకొండూర్, మే 8 (ఆంధ్రజ్యోతి): కల్వర్టును ఓ కారు ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తిమృతి చెందగా మరొకరికి తీవ్రగాయాలు అయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి మండలంలోని పచ్చునూర్ గ్రామానికి చెందిన దాసారపు నర్సయ్య (66) అనే వ్యక్తి సింగరేణిలో రిటైర్డు అయి బెల్లంపల్లిలో నివాసం ఉంటున్నాడు. మానకొండూర్‌కు చెందిన కొంద్ర సంజీవ్ అనే వ్యక్తితో గురువారం నర్సయ్య కారులో పచ్చునూర్‌కు వెళ్లి మానకొండూర్‌కు తిరిగి వస్తున్నారు. అన్నారం గ్రామ శివారులో రోడ్డు పక్కన ఉన్న కల్వర్టుకు కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నర్సయ్య అక్కడికక్కడే మృతి చెందగా సంజీవ్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం అందించగా సిబ్బంది చేరుకొని క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. స్థానిక పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

● ప్రయాణికులకు తప్పిన ప్రమాదం

శంకరపట్నం, మే 8 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం వంకాయగూడెం శివారలో కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని ఆర్టీసీ బస్సు గురువారం ఢీట్టింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సిరిసిల్ల డిపోనకు చెందిన ఆర్టీసీ బస్సు కరీంనగర్ వైపు నుంచి హుజూరాబాద్ వైపు 52మంది ప్రయాణికులతో వెళ్తుంది. ఈ క్రమంలో వంకాయగూడెం శివారులో ఆగి ఉన్న లారీని ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. ఈ ఘనటలో ఆర్టీసీ బస్సు ముందు భాగం పాక్షికంగా దెబ్బతింది. బస్సులో ఉన్న ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాద వివరాలు నమోదు చేసుకున్నారు.

మద్యం మత్తులో వరదకాలువలో పడి ఒకరి మృతి

మల్యాల, మే 8 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో వరద కాలువలో పడి గుర్రం నాగమల్లు(49) అనే వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు. మల్యాల మండలం సర్వాపూర్‌కు చెందిన గుర్రం నాగమల్లు కొంతకాలంగా కుటుంబసభ్యులతో కలిసి వేములవాడలో ఉంటున్నాడు. అనారోగ్యంతో బాధపడుతున్న నాగమల్లు ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. ఇటీవల స్వగ్రామమైన సర్వాపూర్‌కు వచ్చిన నాగమల్లు మంగళవారం సైకిల్‌పై బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో బంధువులు వెతికారు. గురువారం గ్రామ శివారులోని వరదకాలువలో నాగమల్లు మృతదేహాన్ని గమనించిన స్థానికులు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చైన్‌స్నాచింగ్‌కు యత్నించిన ఐదుగురి అరెస్ట్

మల్యాల, మే 8 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఘాట్‌రోడ్డుపై చైన్‌స్నాచింగ్‌కు యత్నించిన ఐదుగురు నిందితులను పట్టుకున్నట్లు మల్యాల ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు. మల్లాపూర్ మండలం సాతారంకు చెందిన ఓర్సు వనజ అనే మహిళ సోమవారం కొండగట్టు అంజనేయస్వామిని దర్శించుకొని ఘాట్‌రోడ్డు మీదుగా తన కొడుకులతో దిగువ కొండగట్టుకు వస్తోంది. కారులో వచ్చిన ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు వనజ మెడలో నుంచి పుస్తెలతాడు అపహరణకు యత్నించగా ఆమె కిందపడిపోవడంతో నిందితులు కారులో పారిపోయారు. ఈ సంఘటనపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సీఐ నీలం రవి ఆదేశాల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మల్యాల బైపాస్ మార్గంలోని సింగిల్‌విండో కార్యాలయం వద్ద బుధవారం సాయంత్రం వాహనాలు తనిఖీ చేస్తుండగా కారులోని ఐదుగురు అనుమానస్పదంగా కనిపించారు. దీంతో విచారణ జరుపగా చైన్‌స్నాచింగ్ దొంగలుగా గుర్తించామని ఎస్సై తెలిపారు. వారంతా కరీంనగర్‌కు చెందిన వారు కాగా దొంగతనాలే ప్రవృత్తిగా మరో చోరీ చేయడానికి వెళ్తూ పట్టుబడినట్లు ఎస్సై తెలిపారు.


బైక్ అదుపు తప్పి యువకుడి మృతి

చొప్పదండి, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్నకొండ శివారులో బైక్ అదుపు తప్పి కిందపడి యువకుడు మృతి చెందాడు. ఎస్‌ఐ సురేందర్ కథనం మేరకు ధర్మారం మండలం కటికనపల్లి గ్రామానికి చెందిన కట్ట నవీన్(32) మరో ఇద్దరితో బైక్‌పై కరీంనగర్‌కు వెళ్లి తిరిగి వస్తున్నారు. ఈక్రమంలో ఆర్నకొండ శివారులో బుధవారం అర్ధరాత్రి తర్వాత బైక్ అదుపు తప్పి కింద పడిపోయింది. నవీన్ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందగా, మిగతా ఇద్దరికీ గాయాలైనట్లు ఎస్‌ఐ సురేందర్ తెలిపారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట, మే 8 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లి గ్రామ శివారులోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై గురువారం బైక్ అదుపుతప్పిన సంఘటనలో కామారెడ్డి జిల్లా బీబీపేట మండలం ఉప్పరపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి అర్జున్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 వాహనంలో మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అర్జున్ తన ద్విచక్ర వాహనంపై గొల్లపల్లిలోని వివాహ వేడుకలకు హాజరై తిరిగి వెళుతున్న క్రమంలో ప్రమాదానికి గురయ్యాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు తెలిపారు.





పరీక్ష..ప్రశ్నార్థకం

- 'శాతవాహన'లో గందరగోళ పరిస్థితి
- ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోతే పరీక్షలు నిర్వహించలేమని తేల్చిచెప్పిన ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు
- గడువు ముగిసినా పరీక్ష ఫీజులు చెల్లించని వైనం
- ఆందోళనలో డిగ్రీ విద్యార్థులు

గణేశ్‌నగర్, మే 8 (ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాల బకాయిలు ప్రభుత్వం మూడేళ్లుగా విడుదల చేయలేదు. డిగ్రీ పరీక్షలు నిర్వహించలేమని ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు చేతులెత్తేస్తున్నాయి. దీంతో శాతవాహన విశ్వవిద్యాలయ పరిధిలో డిగ్రీ సెమిస్టర్ పరీక్షల నిర్వహణ ప్రశ్నార్థకంగా మారింది. ఈ నెల 14 నుంచి డిగ్రీ 2, 4, 6 సెమిస్టర్స్ పరీక్షలు ప్రారంభంకావాల్సి ఉంది. ప్రైవేటు కళాశాలలు చేతులెత్తేయడంతో వర్సిటీ అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. విద్యా సంవత్సరం ముగింపు దశలో పరీక్షలను ఆకస్మికంగా వాయిదా వేయవలసిన పరిస్థితులు తలెత్తాయి. పరీక్షలు వాయిదా పడితే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడతారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 36 వేల మంది విద్యార్థులు

ఉమ్మడి జిల్లా పరిధిలో ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ డిగ్రీ కళాశాలలు 84 ఉన్నాయి. వీటిలో 36 వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ప్రభుత్వం రీయింబర్స్‌మెంట్ బకాయి లు విడుదల చేయకపోవడంతో ప్రైవేట్ కళాశాలలు పరీక్షలు నిర్వహించలేమని ప్రకటించాయి. ఫీజుబకాయిలను పరీక్షలకు ముడిపెట్టొద్దని వర్సిటీ అధికారులు కళాశాలల ప్రతినిధులకు నచ్చ చెబుతున్నా.. వారు వినడం లేదు.

కష్టంగా కళాశాలల నిర్వహణ :

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో మొత్తం 84 డిగ్రీ కళాశాలు ఉన్నాయి. వాటి 15 ప్రభుత్వ కళాశాలలు, ఎనిమిది ట్రైబల్, సోషల్, వెల్ఫేర్ కళాశాలలు ఉన్నాయి. రెండు ఎయిడెడ్, 59 ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. వీటికి కోట్లలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రావాల్సి ఉన్నాయి. దీంతో కళాశాలల నిర్వహణ, అధ్యాపకుల వేతనాలు, వర్సిటీకి చెల్లించాల్సిన గుర్తింపు ఫీజులు భారంగా మారాయని ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు వాపోతున్నాయి. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లిస్తేనే పరీక్షలు నిర్వహిస్తామని డిగ్రీ కాలేజీల యాజమాన్యాలు చెబుతున్నాయి. దీంతో పరీక్షల నిర్వహణపై సందిగ్ధం నెలకొంది. ఇప్పటికే ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ పరీక్షలు పూర్తికాగా.. శాతవాహన పరిధిలో డిగ్రీ పరీక్షలపై ప్రతిష్టంభన నెలకొంది. డిగ్రీ చివరి సెమిస్టర్ విద్యార్థులు మాత్రం తాము పోటీపరీక్షలకు అనర్హులమవుతామని.. పరీక్షలు నిర్వహించాలనిలని కోరుతున్నారు.

అయోమయ పరిస్థితి నెలకొంది

చిక్కుల కిరణ్, విద్యార్థి సంఘం నాయకుడు



శాతవాహన యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ పరీక్షలు నిర్వహిస్తారో.. లేదో తెలియని పరిస్థితి నెలకొంది. ఉన్నత చదువులకు, ప్రవేశ పరీక్షలకు సన్నద్ధం కావాల్సిన సమయంలో విద్యార్థులు పరీక్షలు ఉంటాయో ఉండవో అనే అయోమయంలో పడిపోయారు. చదువులపై దృష్టి సారించలేకపోతున్నారు. వారి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని పరీక్షలు వెంటనే నిర్వహించి విద్యార్థులకు న్యాయం చేయాలి.

బకాయిలు ఇచ్చేంత వరకు పరీక్షలు నిర్వహించలేం

ఎం వెంకటేశ్వరావు, సుప్మా ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు



మూడు సంవత్సరాల బకాయిలు ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. ప్రభుత్వం బకాయిలు ఇచ్చేంత వరకు పరీక్షలు నిర్వహించలేమని వైస్ చాన్సలర్‌కు సుప్మా సభ్యులందరం కలిసి చెప్పాము. ప్రభుత్వం గతంలో చాలా సార్లు మాట ఇచ్చి మాట దాటవేసింది. ఐదు యూనివర్సిటీ పరిదిలో పరీక్షలు బహిష్కరించాము.

బకాయిలను విడుదల చేయాలి

కసిరెడ్డి మణికంఠరెడ్డి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు



ఫీజు బకాయిలు పేరుకుపోవడంతో రాష్ట్రంలో ఉస్మానియా మినహా మిగతా ఐదు యూనివర్సిటీల్లో డిగ్రీ 2, 4, 6 సెమిస్టర్ పరీక్షలు జరగడం లేదు. కళాశాల యాజమాన్యాలు పరీక్ష ఫీజులను యూనివర్సిటీలకు చెల్లించలేదు. దీంతో ప్రధానంగా మూడో సంవత్సరం విద్యార్థులు భారీగా నష్ట పోయే అవకాశం ఉంది. వారు సెమిస్టర్ పరీక్షలు రాసి పాసై పోటీ పరీక్షలు రాయడానికి, పీజీ సెట్ రాయడానికి ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంది. డిగ్రీ విద్యార్థుల్లో దాదాపు 80 శాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ ఆధారపడి చదువుకునేవాళ్లే ఉన్నారు.

ఉన్నత విద్యను నిర్లక్ష్యం చేయొద్దు..

రాచమల్ల రాజు, బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్



గత ప్రభుత్వం ఉన్నత విద్యను నిర్లక్ష్యం చేసింది. ప్రస్తుత ప్రభుత్వమూ అదే దారిలో పయనిస్తోంది. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థుల నుంచి బలవంతంగా ఫీజులు వసూలు చేస్తున్నాయి. స్కాలర్‌షిప్‌లను విద్యా సంవత్సరం ప్రారంభంలోనే విడుదల చేయాలి.

భార్య, అత్తామామల వేధింపులకు యువకుడి బలి

చొప్పదండి, మే 8 (ఆంధ్రజ్యోతి): భార్య, అత్తమామల వేధింపులు భరించలేక యువకుడు మరణించిన సంఘటన గురువారం చొప్పదండిలో జరిగింది. ఎస్‌ఐ సురేందర్ కథనం మేరకు పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం లక్కరం గ్రామానికి చెందిన ఉండాటి సతీష్(30)కు చొప్పదండికి చెందిన కళతో పదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఒక పాప, బాబు ఉన్నాడు. పెళ్లి నాటి నుంచి సతీష్ అత్తగారింట్లో ఉంటుండగా అత్త మానుపాటి రాజవ్వ, మామ మానుపాటి కనుకయ్య, భార్య కళతో పాటు మరదలు వేధింపులు భరించలేక గురువారం ఇంట్లో ఉరివేసుకుని మృతిచెందినట్లు ఎస్‌ఐ సురేందర్ తెలిపారు. మృతుడు సతీష్ తండ్రి సాయిలు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పాత కక్షలతో ఒకరిపై కత్తితో దాడి



చికిత్స పొందుతున్న గంగారెడ్డి

కోరుట్ల రూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల రూరల్ మండలం జోగినిపల్లి గ్రామంలో పాత కక్షలతో గంగారెడ్డి అనే వ్యక్తిపై అదే గ్రామానికి చెందిన నవీన్ గురువారం కత్తితో దాడి చేశాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన నల్ల నవీన్, ముక్కెర గంగారెడ్డిలు ఇద్దరు బర్రెల కాపరులు. వీరి మధ్య గతంలో పాత కక్షలు ఉండేవి. గురు వారం ఉదయం గ్రామంలో ఓ హోటల్ వద్ద ముక్కర గంగారెడ్డి టీ తాగుతుండగా నవీన్ కత్తితో విచక్షణారహితంగా దాడి చేసినట్లు స్థానికులు తెలిపారు. గమనించిన చుట్టుపక్కల వారు వారించడంతో నవీన్ అక్కడి నుంచి పరారుయ్యాడు. గంగారెడ్డిని జగిత్యాల ఏరియా ఆసుపత్రికి బంధువులు తరలించారు. గంగారెడ్డి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కోరుట్ల పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కార్మికులకు కూలి నిర్ణయించాలి

- సీఐటీయూ ఆధ్వర్యంలో సిరిసిల్ల కలెక్టరేట్ ఎదుట కార్మికుల ధర్నా



సిరిస్లిల కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

సిరిసిల్ల కలెక్టరేట్, మే 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం స్వశక్తి సంఘాల మహిళల కోసం అందించే చీరలను తయారుచేసే కార్మికులకు కూలి నిర్ణయించి సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని సీఐటీయూ అమృత్‌లాల్ శుక్లా కార్మిక భవనం నుంచి కలెక్టరేట్ వరకు కార్మికులు బైక్‌ర్యాలీ చేపట్టారు. కలెక్టరేట్ ప్రధాన ద్వారం ఎదుట గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో మరమగ్గాల, వార్పిన్, వైపని కార్మికులు తాము తయారు చేసే చీరలకు కూలి నిర్ణయించడంతోపాటు యజమానులపై చర్యలు తీసుకోవాలంటూ ధర్నా చేశారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ ప్రభుత్వం ఉత్పత్తి చేయిస్తున్న మహిళా పొదుపు సంఘాల సభ్యులకు అందించే చీరలకు సంబంధించి మరమగ్గాల, వార్పిన్, వైపని అనుబంధరంగాల కార్మికులకు మెరుగైన వేతనం వచ్చే విధంగా కూలి పెంచాలని నెల రోజుల క్రితం సమ్మె చేసిన ఫలితంగా ప్రభుత్వం యాజమానులకు ఒక మీటర్‌కు అదనంగా రెండు రూపాయల ధర పెంచిందన్నారు.

కానీ యజమానులు మాత్రం కార్మికులకు కూలి పెంచి ఇవ్వడం లేదన్నారు. దీని వలన కార్మికులకు నష్టం జరుగుతుందన్నారు. కలెక్టర్ స్పందించి యజ మానులతో చర్చలు జరిపి కార్మికులకు కూలి నిర్ణయించే విధంగా చర్యలు తీసుకో వాలని కోరారు. కార్యక్రమంలో వార్పిన్ యూనియన్ అధ్యక్షుడు సిరిమల్లే సత్యం, ఉడుత రవి, మచ్చ వేణు, బూట్ల వెంకటేశ్వర్లు, ఐరేనీ ప్రవీణ్, అవదూత హరిదాసు, అడిచర్ల రాజు, శ్రీకాంత్, రమేష్, మధు, శంకర్, సదానందం, శ్రీనివాస్, రాజశేఖర్, సతీష్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని రైతుల రాస్తారోకో




ఫాజుల్ నగర్‌లో రాస్తారోకో నిర్వహిస్తున్న రైతులు

వేములవాడ రూరల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్ల వేగవంతం చేయాలని గురువారం ఫాజుల్‌నగర్ గ్రామంలో రైతులు బీజేపీ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అకాల వర్షాలు ఉన్న కారణంగా ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలన్నారు. కొనుగోలు కేంద్రంలో సరిపడా లారీలు లేనందున ధాన్యం కొనుగోలులో జాప్యం జరుగుతుందన్నారు. ప్రస్తుతం 20వ నంబర్ నడుస్తుందని 150 నెంబర్ వరకు లైన్ ఉందన్నారు. స్థానిక అధికారులు స్పందించి ధాన్యం కొనుగోలు వీలైనంత వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ గ్రామ శాఖ నాయకుడు చిందం కుమార్, పోగుల రాకేష్, పెద్దకుర్మ మల్లేశం, కొండవేని మోహన్, మునిందర్‌రెడ్డి, ఎగుర్ల రాజు, అంజయ్య, ఓదేలు, సాయిలు, రైతులు పాల్గొన్నారు.

లక్నోలో నాబార్డు రెండు రోజుల జాతీయ సదస్సు

- ప్రారంభించిన నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు



జాతీయ సదస్సులో ప్రతినిధులతో నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు

కరీంనగర్, మే 8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): అంతర్జాతీయ సహకార సంవత్సరంలో భాగంగా సహకార సంస్థల బలోపేతం కోసం నాబార్డు ఆధ్వర్యంలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లక్నోలో నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ సదస్సును గురువారం నాఫ్స్‌కాబ్ చైర్మన్, కేడీసీసీబీ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు ప్రారంభించారు. సహకార సంస్థల్లో షేర్ సర్వీసెస్ ఎంటిటీ, సహకారంపై రెండు రోజుల జాతీయ సదస్సును నిర్వహించినున్నారు. ఈ సందర్భంగా నాఫ్స్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు మాట్లాడుతూ సహకార బ్యాంకుల బలోపేతం కోసం అమిత్‌షా నాయకత్వంలో కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ తీసుకున్న వివిధ లాభాలు, నష్టాలను చర్చించడానికి, తగిన చర్యల కోసం తీసుకున్న చొరవను స్వాగతించారు. కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాలు దీర్ఘకాలంలో చిన్న సహకార బ్యాంకులకు ప్రయో జనం చేకూరుస్తాయని అన్నారు. ఈ సదస్సులో సహకార మంత్రిత్వశాఖ కార్యదర్శి ఆశిష్ కుమార్ బుటానీ, జాయింట్ సెక్రటరీ సిద్ధార్థ్ జైన్, ఉత్తర ప్రదేశ్ రాష్ట్ర ఆర్‌సీఎస్ సౌరబ్ బాబు, నాబార్డు చైర్మన్ షాజీ కేవీ, నాబార్డు డీఎండీ గోవర్ధన్ రావత్, సహకార రంగంలోని ఐటీ, ఇతర విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కేడీసీసీబీకి ఉత్తమ పనితీరు అవార్డు

కరీంనగర్, మే 8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కరీంనగర్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (కేడీసీసీబీ) పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ నుంచి స్వయం సహాయ బృందాల అనుసంధానంలో రాష్ట్రస్థాయి 'ఉత్తమ పనితీరు అవార్డు' లభించింది. గురువారం హైదరాబాద్‌లో రాష్ట్ర పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్ శాఖ మంత్రి సీతక్క చేతుల మీదుగా డీసీసీబీ సీఈవో ఎన్ సత్యనారాయణ అందుకున్నారు. స్వయం సహాయక సంఘాల జీవనోపాధిని మెరుగుపర్చడంలో నిరంతర రుణ సహాయాన్ని అందిచినందుకు కేడీసీసీబీకి ఈ అవార్డు లభించింది.



మంత్రి సీతక్క నుంచి అవార్డు అందుకుంటున్న కేడీసీసీబీ సీఈవో సత్యనారాయణ

మైనార్టీ గురుకులాల సొసైటీ రీజనల్ కో-ఆర్డినేటర్‌కు డాక్టరేట్



కనపర్తి సురేష్

కరీంనగర్ టౌన్, మే 8 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల మైనార్టీ గురుకులాల సొసైటీ రీజనల్ కో-ఆర్డినేటర్ కనపర్తి సురేష్ డాక్టరేట్‌కు ఎంపిక య్యారు. అమితవ్ ఘోష్ ఎంపిక చేసిన నవలల్లో థీమాటిక్ స్టడీ అనే అంశంపై అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మెలిస్సా హెల్ పర్యవేక్షణలో ఆంగ్ల సాహిత్యంలో సమర్పించిన పరిశోధనకు ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించింది. కరీంనగర్ జిల్లాలోని చొప్పదండికి చెందిన సురేష్ డాక్టరేట్ లభించడంపై చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో పాటు పలువురు ఆయనను అభినందించారు.

ఇసుక డంపు స్వాధీనం

ఎండపల్లి, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారేడుపల్లి గ్రామంలో ఎనిమిది ఇసుక డంపులు ఉన్నాయనే సమాచారంతో గురువారం ఎండపల్లి ఆర్ఐ దొంత రాజేశ్వరి నిల్వ ఉంచిన ఇసుకను స్వాధీన పరుచుకున్నారు. ఎనిమిది ట్రాక్టర్ల ఇసుకను వేలం పాట నిర్వహించగా ఏడు వేలు రూపాయల ఆదాయం వచ్చినట్టు ఆర్ఐ రాజేశ్వరి తెలిపారు. ఇసుక అక్రమ రవాణా ఎవరు చేపట్టినా వాటిని సీజ్ చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్ఐ హెచ్చరించారు.

ప్రతీ పల్లెకు ఆర్టీసీ బస్సు సౌకర్యం : విప్



బస్సు వద్ద ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్, ప్రజలు

పెగడపల్లి, మే 8 (ఆంధ్రజ్యోతి): ప్రతి పల్లె కు ఆర్టీసీ బస్ సౌకర్యం కల్పించి, ప్రజల ప్రయాణ బాదలు తీర్చేందుకు కృషి చేస్తున్నట్లు ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పేర్కొన్నారు. పెగడపల్లి మండలంలోని రామబద్రునిపల్లిలో గురువారం బస్ సర్వీస్‌ను కరీంనగర్ డిపో మేనేజర్ శ్రీనివాస్‌తో కలసి ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ రామబద్రుని పల్లి, ల్యాగలమర్రి, ఎల్లాపూర్, కీచులాటపల్లి, రాజారాంపల్లి తదితర గ్రామాల ప్రజల వినతుల మేరకు బస్ సర్వీస్ సేవలను పునరుద్ధరించినట్లు తెలిపారు.

చిరుతల భజనకు వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్





చిరుతల రామాయణాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు, జ్ఞాపికను ప్రదానం చేస్తున్న అతిథులు

కరీంనగర్ కల్చరల్, మే (ఆంధ్రజ్యోతి) 8 : ప్రాచీన గ్రామీణ కళారూపమైన చిరుతల భజనకు ప్రపంచ ప్రఖ్యాతి తీసుకరావాలనే ఉద్దేశ్యంతో కళాభారతిలో కరీంనగర్ ఫోక్ ఆర్ట్స్ అకాడమీ, కళారవళి సోషియో కల్చరల్ అసోసియేషన్, సల్వాజి ఈవెంట్స్ అండ్ కల్చరల్ ఆర్గనైజేషన్ సంయుక్త నిర్వహణలో 8 గంటల పాటు నిర్విరామ చిరుతల భజన చేశారు. ఉమ్మడి 10 జిల్లాలకు చెందిన 600 మంది కళాకారులు ప్రత్యేక వేషధారణలో చిరుతల మోతలతో, చక్కని పాటలతో, గజ్జెలు కట్టి ప్రత్యేక విన్యాసాలు చేస్తూ ప్రదర్శన ఇచ్చారు. రికార్డు నమోదుకు ప్రతినిధిగా వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధి బింగి నరేందర్ హాజరయ్యారు. సాయంత్రం జరిగిన ముగింపు కార్యక్రమానికి అతిథులుగా హాజరైన సుడా చైర్మన్ కోమటి రెడ్డి నరేందర్‌రెడ్డి, పురుమల్ల శ్రీనివాస్, ఆర్‌డీవో సీహెచ్ మహేశ్వర్, మున్సిపల్ అడిషనల్ కమిషనర్ సువార్త ఈవెంట్ రికార్డులో నమోదైనట్లు ప్రకటించారు. నిర్వాహకులు జి కృపాదానం, డాక్టర్ విష్ణుదాసు గోపాలరావు, సల్వాజి ప్రవీణ్‌కు రికార్డు మెమొంటోలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కళాకారులకు పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు, టీం లీడర్లకు పార్టిసిపేషన్ సర్టిఫికెట్స్, జ్ఞాపికలు అందజేశారు.

పీజీ కళాశాలలో భవన నిర్మాణానికి భూమి పూజ



పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్, పక్కన ఎస్‌యూ వీసీ ఉమేష్‌కుమార్

కోల్‌సిటీటౌన్, మే 8 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని యూనివర్సిటీ పీజీ కళాశాలలో సుమారు 10లక్ష రూపాయల వ్యయంతో ఎంబీఏ భవనం, 13లక్షల రూపాయలతో అంతర్గత సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, శాతవాహన యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఉమేష్‌కుమార్ గురువారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ మాట్లాడుతూ నియోజకవర్గంలో విద్యార్థులకు అవసరమయ్యే వివిధ రకాల మౌలిక సదుపాయాలను సమకూరుస్తున్నామని తెలిపారు. శాతవాహన యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ ఉమేష్‌కుమార్ మాట్లాడుతూ అకాడమిక్ బ్లాక్‌తోపాటు అప్రోచ్ రోడ్డు నిర్మిస్తున్నామన్నారు. అనంతరం నూతనంగా ఏర్పాటు చేసిన డిజిటల్ క్లాస్ రూమ్‌ని ప్రారంభించారు. శాతవాహన యూనివర్సిటీ రిజిస్టర్ ప్రొఫెసర్ జాస్తి రవికుమార్, ఓఎస్‌డీ టూ వీసి డాక్టర్ హరికాంత్, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ సురేష్‌కుమార్, శాతవాహన యూనివర్సిటీ చీఫ్ వార్డెన్ డాక్టర్ మనోహర్, ఇంజనీర్ ప్రకాస్‌రావు, సంతోష్‌కుమార్, శ్రీకాంత్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రమాకాంత్, అధ్యాపకులు డాక్టర్ రమేష్‌రెడ్డి, డాక్టర్ రవి, డాక్టర్ ప్రసాద్, అజయ్‌కుమార్ విద్యార్థులు పాల్గొన్నారు.

సరస్వతి పుష్కరాల ఏర్పాట్లపై ఆర్టీసీ ఈడీ సమీక్ష



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఈడీ సోలమన్

భగత్‌నగర్, మే 8 (ఆంధ్రజ్యోతి): త్రివేణి సంగమం స్థానమైన కాళేశ్వరంలో (గోదావరి, ప్రాణహిత, సరస్వతి) సరస్వతి పుష్కరాల సందర్భంగా కాళేశ్వరంలో పనులను పరిశీలించి బస్సుల ఏర్పాట్లపై అధికారులతో ఆర్టీసీ జోన్ ఈడీ పగిడిమర్రి సోమలన్ సమీక్ష నిర్వహించారు. సరస్వతి పుష్క రాలకు కరీంనగర్ జోన్‌లోని వివిధ రీజియన్‌ల నుంచి నడిపే బస్సులకు సంబంధించి చేస్తున్న ఏర్పాటు పనులను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో రీజినల్ మేనేజర్ బి రాజు, వరంగల్ రీజినల్ మేనేజర్ విజయభాను, డిప్యూటీ రీజినల్ మేనేజర్లు భానుకిరణ్, ఎస్ భూపతిరెడ్డి, భూపాలపల్లి డిపో మేనేజర్ ఇందిర, ఈడి కార్యదర్శి యుగంధర్‌రెడ్డి పాల్గొన్నారు.

● కరీంనగర్-వరంగల్ రూట్‌లో డీలక్స్ ప్రయాణికులకు పది శాతం రాయితీ కల్పిస్తున్నట్లు కరీంనగర్ రీజినల్ మేనేజర్ బి రాజు ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్-వరంగల్ రూట్‌లో డీలక్స్ బస్సులలో (డీజిల్, ఎలక్ట్రికల్) ప్రయాణ చార్జీలో పది శాతం రాయితీ ఉందన్నారు. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కొండస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

మెట్‌పల్లి రూరల్, మే, 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జగ్గసాగర్ గ్రామ శివారులోని కొండపై వెలిసిన స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈనెల 15వ తేదీ వరకు స్వామివారి బ్రహ్మోత్సవాలను నిర్వహించేందుకు ఆలయాభివృద్ధి కమిటీ, గ్రామస్థులు ఏర్పాట్లు చేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా బండలింగాపూర్ గ్రామంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో ఉన్న ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పల్లకిలో ఉంచి శోభాయాత్రగా జగ్గసాగర్ గ్రామంలోని కొండస్వామి ఆలయానికి తీసుకొచ్చారు. అనంతరం ఉత్సవమూర్తులను ఆలయంలో ఏర్పాటు చేసి పంచామృతాలతో అభిషేకాలు, అలంకరణ, అర్చనలు తదితర కార్యక్రమాలను పురోహితులు చేపట్టారు. ఈనెల 9న ఆలయంలో నిర్వహించే స్వామి వారి కల్యాణంలో అధిక సంఖ్యలో భక్తులు హాజరై దర్శించుకుని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయాభివృద్ధి కమిటీ, గ్రామస్థులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.



స్వామి వారి శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

ఆన్‌లైన్‌లో రాజన్న సేవలు

భక్తులు ముందే బుక్ చేసుకునే అవకాశం

దూరప్రాంత భక్తులకు తప్పనున్న ఇబ్బందులు



వేములవాడ కల్చరల్, మే 8 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో చేపట్టే సేవలను భక్తుల సౌకర్యార్థం ఆన్‌లైన్‌లోకి తీసుకువచ్చారు. నిత్యం రాష్ట్రంతో పాటుగా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులతో రద్దీగా మారుతున్న సందర్భంగా భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ సేవలను ఆన్‌లైన్ చేశారు. రాజన్న ఆలయంలో నిత్యం నిర్వహించే పూజల వివరాలు తెలియక భక్తులు రాజన్నను దర్శించుకుని తిరిగి ప్రయాణమయ్యేవారు. అయితే రాజన్న ఆల యానికి వచ్చే భక్తులు ఎక్కడున్నా తమ ఫోన్‌లో ఆన్ లైన్ ద్వారా వారం రోజుల ముందే తాము చేయిం చుకునే పూజలను బుక్ చేసుకునే వెసులుబాటును అందుబాటులోకి తీసుకువచ్చారు. రాజన్న ఆలయంతో పాటుగా శ్రీనగరేశ్వర, బద్దిపోచమ్మ, శ్రీలక్ష్మీనర్సింహ స్వామి, శ్రీభీమేశ్వర స్వామి ఆలయాల్లో నిర్వహించే నిత్య, శాశ్వత పూజల వివరాలను ఆన్‌లైన్‌లో పొందు పరిచారు. భక్తులకు తమకు కావాల్సిన టికెట్లను వేములవాడ టెంపుల్.తెలంగాణ.గౌట్. ఇన్ అనే వెబ్ సైట్‌లో బుక్ చేసుకునేలా అందుబాటులోకి తీసుకవచ్చారు.

ఆది, సోమవారాల్లో గర్భాలయ సేవలు రద్దు..

రాజన్న ఆలయానికి ప్రతి ఆది, సోమవారం రోజుల్లో భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది. దీంతో ఆది, సోమవారాల్లో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా గర్భగుడిలో నిర్వహించే పూజలను నిలిపివేశారు. అభిషేకం, అన్నపూజ, ఆకు పూజలను నిలిపివేసి మిగతా సేవలు కొనసాగిస్తారు.

రాజన్న ఆలయానికి వచ్చే భక్తులు స్వామివారికి శాశ్వత పూజలు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. శాశ్వత పూజలు 10సంవత్సరాల వరకు వర్తిస్థాయి. ఏడాదిలో ఒక్కసారి మాత్రమే పూజలు చేయించుకునే వెసులుబాటు ఉంటుంది. శాశ్వత పూజల వివరాలు.. రుద్రాభిషేకం రూ.3000, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం రూ.1500, అన్నపూజ రూ.1000, శివకల్యాణం రూ.5000, మహాలింగార్చన రూ.3000, కుంకుమ పూజ రూ.1000, కోడెపూజ రూ.1000గా నిర్ణయించారు.

వాహనాల పూజల వివరాలు..

లారీ, బస్సు, కారులకు రూ.400, ఆటో, టెంపో రూ.250, మోటార్‌సైకిల్ రూ. 100గా ఉన్నాయి. రాజన్న దర్శనం కోసం వెళ్లే భక్తులు శీఘ్ర దర్శనం టికెట్ ఒక్కరికి రూ.100, బ్రేక్‌దర్శనం ఒక్కరికి రూ.300 ధరలు ఉన్నాయి. రాజన్న ప్రసాదాల వివరాలు... లడ్డూ, బోగం రూ.700, సిరా బోగం రూ. 600, పులిహోర బోగం రూ. 200, దద్దోజనం రూ. 300, లడ్డూ ఒక్కటికి రూ. 20, అభిషేకం లడ్డూ రూ. 100, పులిహోర ఒక్కటి రూ.15.

వసతి గదుల వివరాలు..

వేములవాడ రాజన్న ఆలయ పరిధిలోని ఆయా వసతి గదు ల్లోని రూముల ధరల వివరా లు.. భీమేశ్వర సదన్ గెస్ట్‌హౌస్ రూ.2800, భీమేశ్వర ఏసీ సూట్ రూ.1600, భీమేశ్వర సదన్ ఏసీ ఒక్క రూమ్ రూ.1344, నందీశ్వర ఏసీ సూట్ రూ.2800, నందీశ్వర ఏసీ రూమ్ రూ.1008, నందీశ్వర నాన్ ఏసీ రూమ్ రూ. 500, అమ్మ వారి అతిథిగృహం రూ.1600, పార్వతి పురం బ్లాక్‌లు రూ.672, పార్వతి పురం రూమ్ రూ.336, లక్ష్మగణపతి కాంప్లెక్స్ ఒక్క రూమ్ రూ.448.



భక్తులకు ఇబ్బందులు తలెత్తకూడదనే ఆన్‌లైన్ సేవలు

వినోద్‌రెడ్డి, రాజన్న ఆలయ ఈవో

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయానికి నిత్యం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వేల సంఖ్యలో వస్తున్నారు. భక్తులకు రాజన్న ఆలయంలో నిర్వహించే పూజల వివరాలు తెలియాలనే ఉద్దేశ్యంతోనే ఆన్‌లైన్‌లో ఉంచాము. దూర ప్రాంతం నుంచి వచ్చే భక్తులు వారం రోజుల ముందే తమ ఫోన్ ద్వారా నిమిషాల్లో టికెట్స్, రూమ్‌లు బుక్ చేసుకునే అవకాశాన్ని కల్పించాము. రాజన్న ఆలయానికి వచ్చే భక్తులు ఆన్‌లైన్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి.

నిత్య పూజల వివరాలు..

రుద్రాభిషేకం (మహామండపం) రూ. 1000, కోడెమొక్కు రూ. 200, అభిషేకం (నాగిరెడ్డి మండపం) రూ. 500, అన్న పూజ రూ.500, అన్నపూజ గర్భగుడిలో రూ. 1000, ఆకు పూజ రూ. 1000, కుంకుమ పూజ రూ.300, శివకల్యాణం రూ. 1500, చండీ సహిత రుద్రహోమం రూ. 1516, మహాలింగా ర్చన రూ. 1000, పెద్ద సేవ రూ.350, పల్లకీ సేవ రూ. 200, సత్యనారాయణ వ్రతం రూ.600 కాగా, శ్రీభీమేశ్వరస్వామి ఆల యంలో పూజల వివరాలు శ్రీభీమేశ్వర అభిషేకం రూ. 516, నవగ్రహ పూజ రూ.516, ద్వాదశ జ్యోతిర్లింగాల అభిషేకం రూ.516గా ఆన్‌లైన్ చేశారు.



కాల్షియం కార్బైడ్ నిల్వల గోదాంలో అధికారుల సోదాలు



సోదాలు చేస్తున్న పోలీసులు, ఫుడ్ సేఫ్టీ అధికారులు

జగిత్యాల, మే 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తీన్‌ఖానీ చౌరస్తా సమీపంలో గల ఓ గోదాంలో నిబంధనలకు విరుద్ధంగా కాల్షియం కార్బైడ్ బాక్స్‌లను పెద్దఎత్తున నిల్వ చేశారన్న సమాచారంతో పోలీసులు, ఫుడ్ సేఫ్టీ అధికారులు గురువారం రాత్రి సోదాలు నిర్వహించారు. సదరు గోదాంలో సీలు గల బాక్సుల్లో ప్యాకెట్లు నిల్వచేయడాన్ని గుర్తించారు. సుమారు గంట పాటు పోలీసులు, ఫుడ్ సేఫ్టీ అధికారులు సోదాలు చేశారు. సహజసిద్ధంగా పండాల్సిన మామిడి, ఇతర పండ్లను కృతిమ పద్ధతిలో త్వరగా పండేలా నిర్దేశిత ప్రమాణాలకు మించి కాల్షియం కార్బైడ్ వినియోగంలో మగ్గబెట్టడానికి కొన్ని నిషేధిత కంపెనీలు, నాసిరకం కంపెనీలకు చెందినవి ఉన్నట్లు అనుమానించి పలు బాక్సులను పట్టుకున్నారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ కిరణ్ కుమార్, ఫుడ్ సేఫ్టీ అధికారి శేఖర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మార్కులు తక్కువ వచ్చాయని విద్యార్థిని ఆత్మహత్య

జగిత్యాల అర్బన్, మే 8 (ఆంధ్రజ్యోతి): బీటెక్ మొదటి సంవత్సరంలో మార్కులు తక్కువ వచ్చాయని జగిత్యాల జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన కన్నవేణి సౌజన్యరెడ్డి అనే విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడింది. జగిత్యాల సీఐ వేణుగోపాల్ తెలిపారు. రాయికల్ పట్టణానికి చెందిన కన్నవేణి మల్లారెడ్డి కూతురైన సౌజన్యరెడ్డి హైదరాబాద్‌లో బీటెక్ చదువుతోంది. గురువారం ఉదయం లేచి చూసేసరికి హాల్లో ఉరి వేసుకుని మృతిచెంది ఉంది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ధర్మపురిలో వైభవంగా చందనోత్సవం





యోగా నరసింహ స్వామి వారలను చందనంతో అలంకరణ చేసి హారతి ఇస్తున్న అర్చకుడు, స్వామి వారి పూజల్లో పాల్గొన్న భక్తులు

- భారీగా దర్శనం చేసుకున్న భక్తులు

ధర్మపురి, మే 8 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో నరసింహ నవరాత్రోత్సవాల్లో భాగంగా గురువారం చందనోత్సవం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ నెల మూడో తేదీ నుంచి ప్రారంభమైన నవరాత్రోత్సవాల్లో భాగంగా ఆరో రోజు ఉదయం ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, అర్చకులు స్వామి వారలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. యోగ, ఉగ్ర నారసింహులను అందంగా చందనంతో అలంకరించారు. లోక కల్యాణార్థం సుదర్శన, నారసింహ, రుద్ర హోమాలు నిర్వహించారు.

గోదావరి నదిలో స్నానాలు చేసిన భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థ, ప్రసాద వితరణ చేశారు. ఆలయాలు నరసింహ నామస్మరణలతో ప్రతిధ్వనించాయి. కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, టీసీసీసీ సభ్యులు, ధర్మపురి మండల అధ్యక్షుడు సంగనభట్ల దినేష్, ధర్మకర్తలు తదితరులు పాల్గొన్నారు.

● నరసింహుని సన్నిధిలో ప్రభుత్వ విప్ పూజలు

నరసింహ నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని లక్ష్మీ నరసింహస్వామి ఆలయాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ గురువారం సందర్శించారు. అనంతరం ఆయన చందనోత్సవ కార్యక్రమంలో పాల్గొని స్వామి వారిని దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ స్వామి శేష వస్త్రం కప్పి, ప్రసాదాలు అందించి సన్మానించారు.



ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు ప్రసాదం అందజేస్తున్న అధికారులు

మానసాదేవి ఆలయంలో సప్తమ వార్షికోత్సవాలు ప్రారంభం



అమ్మవారికి పసుపుతో అభిషేకం చేస్తున్న వేద పండితులు

గన్నేరువరం, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖాసింపేట మానసాదేవి ఆలయ సప్తమ వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనంగా ప్రారంభం అయ్యాయి. ఈ వేడుకల్లో ఉదయం నుండి గణపతి హోమాలు, మానసాదేవి, అపురూపలక్ష్మి అమ్మవార్లకు 54 కిలోల పసుపు, కుంకుమలతో అభిషేకాలు ఆలయ ప్రధాన అర్చకుడు అమర్‌నాథ్‌శర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.

'శాతవాహన' పరిధిలో 15 నుంచి బీఎస్సీ పరీక్షలు

గణేశ్‌నగర్, మే 8 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో బీఎస్సీ ఆనర్స్ (4 సంవత్సరాల కోర్స్)లో రెండో, నాలుగో సెమిస్టర్ పరీక్షలు మే 15 నుంచి ప్రారంభమై మే 30కి ముగు స్తాయని, బీఎస్సీ ఆనర్స్‌లో రెండో, నాలుగో సెమిస్టర్ పరీక్షలు కంప్యూటర్ సైన్స్‌లో, రెండవ సెమిస్టర్ బయో మెడికల్ సైన్స్‌లో జరగనున్నట్టు విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి డా.డి.సురేష్ కుమార్ తెలిపారు. విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధం కావాలని ఇతర వివరాలకు కళాశాలలో గాని, విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌ను సందర్శించాలని తెలిపారు.



సెలవుల్లో ఉత్సాహంగా

● 'స్వచ్ఛ' హుజూరాబాద్‌లో భాగంగా వేసవి శిక్షణ శిబిరం ● మున్సిపాలిటీ ఆధ్వర్యంలో కార్యక్రమాలు



హుజూరాబాద్‌లో ఫుట్‌బాల్ ఆడుతున్న విద్యార్థులు

హుజూరాబాద్, మే 8 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో 'స్వచ్ఛ' కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు క్రీడా నైపుణ్యాలను మెరుగు పరిచేందుకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. స్వచ్ఛ హుజూరాబాద్ కార్యక్రమంలో భాగంగా హైస్కూల్ మైదానంలో ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని జడ్జి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థులు ఉత్సాహంగా ఆటల్లో పాల్గొంటున్నారు. ముఖ్యంగా కబడ్డీ, ఫుట్‌బాల్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, క్యారం, చందరంగం, కరాటే, క్రికెట్, ఖోఖో, హాకీ తదితర ఆటల పోటీల్లో పీఈటీల ఆధ్వర్యంలో నేర్చుకుంటున్నారు. పిల్లలు ఖాళీగా ఉంటే సెల్‌ఫోన్, టీవీల వైపు మొగ్గు చూపకుండా ఉండేందుకు క్రీడలు అలవాటు చేస్తున్నారు. ఈ క్రీడాకారులకు డాక్టర్ నవీన్, న్యాయవాది ముక్కెర రాజు, సారయ్యలు టీషర్ట్స్, బిస్కెట్స్, పండ్లు, పాలు అందిస్తున్నారు. తల్లిదండ్రులు పిల్లల ఆటలను ప్రోత్సహిస్తుండడంతో ఉదయం సాయంత్రం వేళల్లో హైస్కూల్ మైదానం విద్యార్థులతో కిక్కిరిసిపోతోంది.

విద్యార్థుల్లో నైపుణ్యం పెంచేందుకే క్రీడల్లో శిక్షణ

సమ్మయ్య, మున్సిపల్ కమిషనర్, హుజూరాబాద్



వేసవిలో విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంచేందుకు స్వచ్ఛ హుజూరాబాద్‌లో భాగంగా క్రీడా పోటీలు నిర్వహిస్తున్నాం. రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా మున్సిపల్ ఆధ్వర్యంలో క్రీడాకారులకు శిక్షణ ఇస్తున్నాం. విద్యార్థులు ఇంట్లో ఉంటే సెల్‌ఫోన్, టీవీలకు అలవాటు పడకుండా క్రీడలు దోహదపడుతాయి. పిల్లలను తల్లిదండ్రులు కూడా ప్రోత్సహిస్తున్నారు. ఖోఖో, హాకీ, వాలీబాల్, క్రికెట్, చందరంగం, క్యారం తదితర క్రీడల్లో విద్యార్థులు పాల్గొంటున్నారు. ఈ పిల్లలకు దాతలు ముందుకు వచ్చి పండ్లు, పాలు, బిస్కెట్స్ అందజేస్తుండటం అభినందనీయం.





క్యారం, చందరంగం ఆడుతున్న విద్యార్థులు

సైలెన్సర్లు మార్చి ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు

- జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్



సైలెన్సర్లను ధ్వంసం చేస్తున్న పోలీసులు

జగిత్యాల అర్బన్, మే 8 (ఆంధ్రజ్యోతి): సైలెన్సర్లు మార్చి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జగిత్యాల ఎస్పీ అశోక్‌కుమార్ హెచ్చరించారు. అధిక శబ్దం కలిగించే 130 మాడిఫైడ్ సైలెన్సర్లను గురువారం ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కొన్ని రోజులుగా స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తు ద్విచక్ర వాహనదారులు సైలెన్సర్లను మాడిఫై చేసి అధిక శబ్దంతో ప్రజలకు ఇబ్బందుల కలుగజేస్తున్న 130 వాహనాలను స్వాధీనం చేసుకుని వాటి సైలెన్సర్‌ను ధ్వంసం చేసినట్టు వివరించారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ట్రాఫిక్ నియమాలు పాటించి పోలీసులకు సహకరించాలని అన్నారు. శబ్ద కాలుష్యాన్ని నిరోధించేందుకు చేపట్టిన ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా అధిక శబ్దం కలిగించే మాడిఫైడ్ సైలెన్సర్లను వినియోగిస్తున్న ద్విచక్ర వాహనాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మాడిఫై సైలెన్సర్‌లను వాడితే క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో లైసెన్స్ రద్దు చేస్తామని ఎస్పీ హెచ్చరించారు. కార్యక్రమంలో డీఎస్పీ రఘుచందర్, టౌన్ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్, ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్ రఫీక్‌ఖాన్, ట్రాఫిక్ ఎస్సై మల్లేష్ సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి పొన్నంకు ఆర్టీసీ అధికారుల శుభాకాంక్షలు

భగత్‌నగర్ : రాష్ట్ర రవాణా శాఖమంత్రి పొన్నం ప్రభాకర్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్టీసీ అధికారుల గురువారం పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సోలమన్, రీజినల్ మేనేజర్ బి రాజు, డిప్యూటీ రీజినల్ మేనేజర్ భూపతిరెడ్డి, హుస్నాబాద్ డిపో మేనేజర్ వెంకన్న, పీఆర్‌ఓ మల్హర్‌రావు పాల్గొన్నారు.

కరీంనగర్-2 డిపోను పరిశీలించిన ఆర్టీసీ ఈడీ

భగత్‌నగర్, మే 8(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పగిడిమర్రి సోలమన్ గురువారం కరీంనగర్-2 డిపోను పరిశీలించారు. డిపోలో ఎలక్ట్రికల్ బస్సులకు సంబంధించి ఏర్పాటు చేసిన చార్జింగ్ పాయింట్లు, వాటి మెయింటెనెన్స్ ప్రాక్టీసెస్ గురించి వివవరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం బస్‌స్టేషన్‌ను పరిశీలించి వివిధ ప్లాట్‌ఫారాలపై ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అందుబాటులో ఉన్న బస్సులు, ప్రయాణికులకు కల్పించిన తాగునీటి సదుపాయాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రీజినల్ మేనేజర్ బి రాజు, డిప్యూటీ రీజినల్ మేనేజర్ వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

అన్నదానం

కరీంనగర్ రూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి) కరీంనగర్ మండలం బొమ్మకల్ గ్రామంలోని లయన్స్ క్లబ్ ఆఫ్ బొమ్మకల్ జెడ్సీ లయన్ చింతల లావణ్య- కిషన్ పటేల్‌ల పెళ్లి రోజు సందర్భంగా గురువారం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో అన్నదానం, వీరబ్రహ్మేంద్ర వృద్ధాశ్రమంలో అల్పాహార వితరణ, ప్రభుత్వం, వికలాంగుల ఆశ్రమంలో పండ్లు, బ్రెడ్లు వితరణ చేశారు.

దరఖాస్తులు కార్యదర్శికి ఇవ్వాలి

కరీంనగర్ రూరల్ : గ్రామ పంచాయతీ నగునూర్ నుంచి జారీ చేయబడు, జనన, మరణ ఎటువంటి ధ్రువీకరణ పత్రాల కోసం ఇచ్చే దరఖాస్తులు గ్రామ పంచాయతీ కార్యదర్శికి మాత్రమే అందజేసి రశీదు పొందాలని గ్రామ ప్రత్యేక అధికారి, ఎంపీడీవో సంజీవరావు ప్రకటనలో తెలిపారు.

సమ్మె పోస్టర్ ఆవిష్కరణ

భగత్‌నగర్: నగరంలోని టవర్ సర్కిల్ లేబర్ అడ్డా వద్ద ఈ నెల 20న నిర్వహించే దేశ వ్యాప్త సమ్మె పోస్టర్‌ను బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి వట్టి జగదీష్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు.

రైతు ముంగిట శాస్త్రవేత్తలు

భగత్‌నగర్, మే 8(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం నాగులమల్యాలలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయపరిశోధన స్థానం కరీంనగర్ ఆధ్వర్యంలో రైతు ముంగిట శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు.

మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

గణేశ్‌నగర్, మే 8(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ విజయవంతంపై బీజేపీ విశ్రాంత ఉద్యోగ ఉపాధ్యాయ జిల్లా సెల్ ఆధ్వర్యంలో గురువారం తెలంగాణ చౌక్‌లో ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. నరహరి లక్ష్మారెడ్డి,గంట్ల నరసింహారెడ్డి, కొండం వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా మంత్రి పొన్నం ప్రభాకర్ జన్మదిన వేడుకలు

కరీంనగర్ అర్బన్, మే 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జన్మదినం సందర్భంగా గురువారం జిల్లావ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందిరాచౌక్‌లో డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, జిల్లా ఆర్టీఏ మెంబర్ పడాల రాహుల్, పీసీసీ కార్యదర్శి వైద్యులు అంజన్ కుమార్ హాజరై కేక్ కట్‌చేసి సంబరాలు నిర్వహించారు. నగరంలోని రెవెన్యూ గార్డెన్‌లో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన కార్యక్రమానికి మంత్రి పొన్నం ప్రభాకర్ కుటుంబ సభ్యులు పొన్నం అనూప్, ఆర్టీఏ మెంబర్ పడాల రాహుల్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ముత్యం శంకర్, ఆశిష్‌గౌడ్ హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. కరీంనగర్ పట్టణంలోని కాపువాడ శివాలయంలో కాంగ్రెస్ నాయకులు శ్రీరాముల రమేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంచిర్యాల చౌరస్తా వద్ద నగర కాంగ్రెస్ ఎస్సీసెల్ నగర కాంగ్రెస్ అధ్యక్షులు కొరివి అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి కేక్‌కట్ చేసి, మజ్జిగ పంపిణీ చేశారు. టీపీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్‌కుమార్ ఆధ్వర్యంలో సివిల్ హాస్పిటల్‌లో అన్నదానం నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ మల్లికార్జున రాజేందర్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

- గణేశ్‌నగర్ : యువజన కాంగ్రెస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు ముత్యం శంకర్, యువజన కరీంనగర్ అసెంబ్లీ అధ్యక్షులు పంజాల కృపసాగర్ ఆధ్వర్యంలో తెలంగాణ చౌక్‌లో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకులను నిర్వహించారు. కరీంనగర్ జిల్లా రీజినల్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ మెంబర్ పడాల రాహుల్ పాల్గొన్నారు.
- భగత్‌నగర్: చింతకుంట రాజీవ్‌గృహకల్పలో గుర్రం సత్యం గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా పొన్నం జన్మదిన వేడుకలు నిర్వహించారు. కొత్తపల్లి బస్టాండ్ వద్ద జరిపిన జన్మదిన వేడుకల్లో డీసీసీ ఉపాధ్యక్షుడు రాచకొండ ప్రభాకర్, డీసీసీ కార్యదర్శి పొన్నం సత్యనారాయణగౌడ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.
- హుజూరాబాద్: పట్టణంలో యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు చల్లూరి రాహుల్ ఆధ్వర్యంలో ఏరియా ఆస్పత్రిలో 58మందితో రక్తదానం చేశారు.



తెలంగాణ చౌక్ వద్ద మంత్రి పొన్నం ప్రభాకర్ జన్మదిన వేడుకల్లో నాయకులు

- హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ హైద్రాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.
- సైదాపూర్: కాంగ్రెస్ మండలాధ్యక్షుడు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దొంత సుధాకర్, డీసీసీ అధికార ప్రతినిధి మ్యాకల రవీందర్, సింగిల్‌విండో అధ్యక్షుడు కొత్త తిరుపతిరెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.
- ఇల్లందకుంట: మండల కేంద్రంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు పెద్ది కుమార్ ఆధ్వర్యంలో సీతారామచంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.
- రామడుగు: మండల కేంద్రంలో జరిగిన వేడుకల్లో యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అనుపురం పరశురామ్‌గౌడ్, మామిడి దిలీప్ కుమార్ పాల్గొన్నారు.
- వీణవంక: మండల కేంద్రంలో జరిగిన వేడుకల్లో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎక్కటి రఘుపాల్‌రెడ్డి, నాయకులు గంగాడి తిరుపతిరెడ్డి, మదాసి సునీల్ పాల్గొన్నారు.
- చొప్పదండి: మండల కేంద్రంలో న నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ అధ్యక్షులడు నిజానపురం చందు, జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమాండ్ల గంగయ్యగౌడ్ పాల్గొన్నారు.

సూరేపల్లి సుజాతపై చర్యలు తీసుకోవాలి



సీపీకి ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న మహిళా మోర్చా నాయకులు

కరీంనగర్ క్రైం, మే 8(ఆంధ్రజ్యోతి): దేశాన్ని, సైనికుల సాహసాన్ని కించపరుస్తూ 'ఆపరేషన్ సిందూర్'ను ఎగతాళి చేసే విధంగా సోషల్ మీడియాలో పోస్టు పెట్టిన రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యురాలు, శాతవాహన యూనివర్సిటీ ప్రొఫెసర్ సూరేపల్లి సుజాతపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గురువారం బీజేపీ శ్రేణులతో కలిసి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి పోలీస్ కమిషనర్ గౌస్ ఆలంకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ తక్షణమే ఆమెను సస్పెండ్ చేసి, రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని అన్నారు. మాజీ మేయర్ వై సునీల్‌రావు, మాజీ జిల్లా అధ్యక్షులు బాస సత్యనారాయణరావు, మాజీ డిప్యూటీ మేయర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుగ్గిళ్ళపు రమేష్ పాల్గొన్నారు.

మహిళా మోర్చా ఆధ్వర్యంలో..

గణేశ్‌నగర్ : ఆపరేషన్ సిందూర్‌పై ఎగతాళిగా సోషల్ మీడియాలో పోస్టు పెట్టిన శాతవాహన యూనివర్సిటీ ప్రొఫెసర్, రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యురాలు సూరేపల్లి సుజాతపై దేశద్రోహం కేసు నమోదు చేసి ఉద్యోగం నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు చొప్పరి జయశ్రీ ఆధ్వర్యంలో శాతవాహన యూనివర్సిటీ వద్ద నిరసన చేపట్టి, ప్రొఫెసర్ సురేపల్లి సుజాత దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం వైస్ చాన్సలర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాపర్తి విజయ దేశ శిల్ప, వంగల శ్రీదేవి, బండారి గాయత్రి, నాగసముద్రం ప్రవీణ్, జాడి బాల్‌రెడ్డి, ప్రేమలత ,చంద్రకళ , సునీత, మామిడి చైతన్య, మాలతి, కొలుగూరి భారతి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గణేశ్‌నగర్,మే8 (ఆంధ్రజ్యోతి): నేడు నగరంలో విద్యుత్ మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా శుక్రవారం ఉదయం 8:30 నుంచి 10:30 వరకు వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ వన్,టూ, ఏడీఈలు, పంజాల శ్రీనివాస్‌గౌడ్, ఏం లావణ్య తెలిపారు. మెయిన్ రోడ్ కమాన్ ఏరియాలో ఉదయం 8గంటల నుంచి 10 గంటల వరకు, రాంనగర్ ఏరియాలో ఉదయం 9:30 నుంచి 10:30 వరకు, సాయంత్రం 5గంటల గంటల నుంచి 6 గంటల వరకు వర్క్‌షాప్ ప్రాంతంలో సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

గణేశ్‌నగర్,మే 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని లేకుంటే పరీక్షలు నిర్వహించలేమని తెలంగాణ రాష్ట్ర డిగ్రీ, పీజీ కళాశాలల అసోసియేషన్ ఒక ప్రకటనలో పేర్కొన్నది. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించక అనేక డిగ్రీ కళాశాలలు మూతపడ్డాయన్నారు. రీయిబర్స్‌మెంట్ చెల్లిస్తే ఈ నెల 14నుంచి ఐదు యూనివర్సిటీలు ఇచ్చిన పరీక్ష షెడ్యూలు ప్రకారం ఉంటుందని, లేనిపక్షంలో పరీక్షల నిర్వహణ సాధ్యం కాదని తెలిపింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర డిగ్రీ,పి.జి కళాశాలల అసోసియేషన్ అధ్యక్షుడు డా.సూర్యనారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి యాద రామకృష్ణ ఉన్నారు.



దుబ్బపల్లిలో వృథాగా ఉన్న షెడ్

నిరుపయోగంగా కంపోస్టు షెడ్‌లు

కరీంనగర్ రూరల్, మే 7 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్య నియంత్రణకు నిర్మించిన కంపోస్టు షెడ్‌లు పంచాయతీ అధికారుల నిర్లక్ష్యంతో నిరుపయోగంగా మారుతున్నాయి. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రెండు లక్షల 50వేల రూపాయల వ్యయంతో నిర్మించిన కంపోస్టు షెడ్‌లో తడి, పొడి చెత్తను వేరు చేసి కంపోస్టు ఎరువు తయారు చేయాలన్న ప్రభుత్వ ఆశయం నీరుగారిపోతుంది. పారిశుధ్య కార్మికులు చెత్తను పక్కనే ఉన్న వాగుల్లో , రోడ్లపై పడేయడంతో దుర్గంధం వెదజల్లుతోంది. కరీంనగర్ మండలంలో నిర్మించిన కంపోస్టుషెడ్‌లు ఎక్కడ చూసినా నిరుపయోగంగా ఉన్నాయి. గ్రామ పంచాయతీల్లో సేకరించిన చెత్తను రోడ్లపై, వాగుల్లో వేయకుండా చర్యలు తీసుకుని షెడ్ నిర్వహణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

బండి సంజయ్ కార్యాలయానికి అజ్ఞాత వ్యక్తి ఫోన్

- అదుపులోకి తీసుకున్న పోలీసులు

న్యూఢిల్లీ, మే 8(ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీలోని కేంద్ర హోం మంత్రి బండి సంజయ్ కార్యాలయానికి ఓ అజ్ఞాత వ్యక్తి ఫోన్ చేసి తాను చెప్పిన పని చేయాలని లేదంటే మీ సంగతి చూస్తానంటూ హెచ్చరించాడు. తాను ప్రధానమంత్రి కార్యాలయ ఆర్థిక సలహాదారుడినంటూ బుకాయించిన వ్యక్తి తాను చెప్పిన పని చేయాలంటూ మంత్రి కార్యాలయ సిబ్బందిపై బెదిరింపులకు దిగాడు. దీంతో కార్యాలయ సిబ్బంది గురువారం రాచకొండ సీపీ సుధీర్ బాబుకు ఫోన్‌చేసి జరిగిన ఘటనను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సీపీ ఆదేశాలతో రంగంలోకి దిగిన పోలీసులు ఫోన్ చేసి బెదిరించిన వ్యక్తి ఆదిభట్ల పరిధిలోని నాదర్‌గుల్ పరిధిలోని జయసూర్యనగర్‌కు చెందిన కేపీరావుగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. పైరవీల కోసం కేపీ రావు గతంలోనూ పలు ప్రభుత్వ కార్యాలయాలకు, రాజకీయ నాయకులకు ఫోన్లు చేసినట్లు పోలీసులు గుర్తించారు.

మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల జన్మదిన వేడుకలు

కరీంనగర్ టౌన్, మే 8 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ జన్మదిన వేడుకలను గురువారం సాదాసీదాగా జరిగాయి. ఉగ్రవాదంపై పోరులో భాగంగా చేపట్టిన ఆపరేషన్ సిందూర్ సైనిక చర్యకు సంఘీభావంగా తన జన్మదిన వేడుకలకు బదులు సామాజిక కార్యక్రమాలు నిర్వహించాలని గంగుల కమలాకర్ పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో గంగుల కమలాకర్ యూత్ ఆధ్వర్యంలో క్యాంపు కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డవేని మధు, కొత్తపల్లి మాజీ మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, ఎమ్మెల్యే పీఏ అయిత కిషన్ ప్రసాద్ పాల్గొని జీకే యూత్ సభ్యులతో కలిసి రక్తదానం చేశారు. సేకరించిన రక్తాన్ని ఆపరేషన్ సింధూర్ సైనిక సహాయార్థం పంపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బోనాల శ్రీకాంత్, బీఆర్ఎస్ నాయకుడు కలర్ సత్తన్న, జీకే యూత్ అధ్యక్షుడు మొగిలోజు వెంకట్, ప్రధాన కార్యదర్శి పొన్నం రాజుగౌడ్, నాయకులు గంగాధర చందు, మీర్ షౌకత్ అలీ, నవాజ్ హుస్సేన్, బోనాల శ్రవణ్, క్రిపాల్‌సింగ్, ప్రశాంత్‌గౌడ్, సంతు శ్రావణ్, తాటి పవన్, పూసల శ్రీకాంత్, మేచినేని పవన్ కుమార్, జవ్వాజి హరికృష్ణ, చెల్లోజి శ్రీనివాస్, కాకులమర్రి వరుణ్ రావు తదితరులు పాల్గొన్నారు.

చింతకుంటలో మొక్కలు నాటిన బీఆర్ఎస్ నాయకులు

భగత్‌నగర్, మే 8(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం చింతకుంటలోని రాజీవ్ గృహకల్పలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు చెట్టిపెల్లి నరేందర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గంగుల జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపిపి తిరుపతినాయక్, గుర్రాల ప్రకాశ్‌రెడ్డి, రేణిగుంట రాజు, చాంద్‌పాషా, స్వప్న, వరలక్ష్మి, లత, రవీందర్, కనకచారి, సలీం, వాజిత్ పంతులు సూర్యనారాయణ, శశి, ఆకాష్‌రెడ్డి, మహేష్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

దేశసేవలో భాగస్వాములవుతాం : ఐఎంఏ

సుభాష్‌నగర్, మే 8(ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదుల ఏరివేతలో భారత ప్రభుత్వం చేపట్టే ఏ కార్యక్రమంలో నైనా తాము భాగస్వాములుగా ఉంటామని కరీంనగర్ ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ ఎనమల్ల నరేష్, కార్యదర్శి డాక్టర్ నవీన్‌కుమార్, కోశాధికారి డాక్టర్ విజయ్‌కుమార్ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ దార్శనికత నాయకత్వంలో చేపట్టబోయే కార్యక్రమాలకు కరీంనగర్ ఐఎంఏ పూర్తి సంఘీభావంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుత క్లిష్టమైన సమయంలో ఐఎంఏలోని ప్రతి ఒక్కరూ అవసరమైన అన్ని ఆరోగ్యరక్షణ సేవలు అందించడానికి పూర్తి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. సైనికులకు అండగా నిలువాలన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు ఆరోగ్య మహిళ వైద్య శిబిరం

గణేశ్‌నగర్, మే 8(ఆంధ్రజ్యోతి): నగరంలోని సప్తగిరి కాలనీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ప్రభుత్వ నాల్గవ తరగతి ఉద్యోగులు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఆరోగ్య మహిళ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. బీసీ హాస్టల్‌లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో అక్కడ పనిచేస్తున్న ఉద్యోగులందరికీ హెల్త్ స్ర్కీనింగ్ పరీక్షలతో పాటు ఇతర వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందచేశారు.ఈ కార్యక్రమంలో డీఐఓ డాక్టర్ సాజిద, ఎంసీహెచ్‌పీవో డాక్టర్ సనజవేరియా, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ అనిల్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మీర్ సాఫీర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

కరీంనగర్ కల్చరల్, మే (ఆంధ్రజ్యోతి) 8 : స్థానిక భగత్‌నగర్ జెడ్‌పి క్వార్టర్స్‌లోని సముదాయ ఆలయాల వార్షిక బ్రహ్మోత్సవాలు ఏడవ రోజు గురువారం ఘనంగా ముగిసాయి. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ యాగండ్ల అనిల్‌కుమార్‌గౌడ్, ధర్మకర్తలు సత్యనారాయణ, శ్రీనివాస్, కవిత, ఆనంద్‌రెడ్డి, కృష్ణ, ఈఓ కొన్న కాంతారెడ్డి, సిబ్బంది, దాతలు, భక్తులు పాల్గొన్నారు. గతంలో వాగ్దానం చేసిన వ్యాపారవేత్త రాచకొండ చక్రధర్‌రావు తన సొంత ఖర్చులతో సుమారు 50 లక్షలు విలువ చేసే అయ్యప్ప ఆలయ మండప పునర్నిర్మాణానికి గురువారం పనులు ప్రారంభించారు.

హుజూరాబాద్ టౌన్ సీఐగా కరుణాకర్



హుజూరాబాద్, మే 8 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ టౌన్ సీఐగా కరుణాకర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న టౌన్ సీఐ తిరుమల్‌గౌడ్ మల్టీజోన్ హైద్రాబాద్ ఇన్‌స్పెక్టర్ జనరల్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఐజీ కార్యాలయంలో పనిచేస్తున్న కరుణాకర్‌ను హుజూరాబాద్ టౌన్ సీఐగా నియామకం చేశారు. ఈ మేరకు బాధ్యతలు చేపట్టగా, సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

టీడీపీకి పూర్వవైభవం తీసుకొస్తాం

- మానకొండూర్ నియోజకవర్గ పరిశీలకుడు రొడ్డ శ్రీనివాస్

శంకరపట్నం, మే 8 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీకి పూర్వ వైభవం తీసుకొస్తామని మానకొండూర్ నియోజకవర్గ పరిశీలకులు రొడ్డ శ్రీనివాస్ అన్నారు. గురువారం శంకరపట్నం మండలంలో అడ్‌హాక్ కమిటీ పార్లమెంట్ సభ్యులు మోరె ప్రభాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన టీడీపీ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ారక్రమంలో సీనియర్ నాయకులు బైరి తిరుపతి, షాబీర్, కదిరె కొంరయ్య, మహబూబ్‌అలీ, వీరమల్లు, సాగర్ పాల్గొన్నారు.

ఉద్యోగుల, ప్రజాప్రతినిధుల పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివించాలి



వినతిపత్రం అందిస్తున్న అక్షర

తిమ్మాపూర్, మే 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలు, ప్రజాప్రతినిధుల పిల్లలు కచ్చితంగా ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలల్లో, చదువుకుంటూ హస్టళ్లలో ఉండే విధంగా ప్రభుత్వం ప్రత్యేక జీవో తీసుకురావాలని ఓ విద్యార్థిని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారా యణను గురువారం కలిసి వినతిపత్రం అందజేసింది. గన్నేరువరం మండలం, చీమలకుంటపల్లి గ్రామానికి చెందిన బామండ్ల అక్షర, రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలో కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో 9వ తరగతి పూర్తి చేసింది. ప్రజాప్రతినిధిగా, ప్రభుత్వ ఉద్యోగిగా జీతం తీసుకుంటూ వారి పిల్లలను మాత్రం ప్రభుత్వ పాఠశాలల్లో, హాస్టళ్లలో చదివించడం లేదని పేర్కొంది. ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు అందరి పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదివించాలని చెబుతూ వారు మాత్రం కార్పొరేట్ పాఠశాలల్లో, హాస్టళ్లలో చదివిస్తున్నారని వినతిపత్రంలో విద్యార్థిని అక్షర పేర్కొంది. ప్రభుత్వ పాఠశాలలో చదివిన వారికే ప్రభుత్వ ఉద్యోగం, ప్రజాప్రతినిధికి అర్హులుగా గుర్తించి జీవో తేవాలని కోరింది.

నేటి నుంచి క్రైస్తవ ఉజ్జీవ మహాసభలు

కరీంనగర్ కల్చరల్, మే (ఆంధ్రజ్యోతి) 8: జిల్లా కేంద్రంలోని సేయింట్ మార్క్స్ చర్చి గ్రౌండ్‌లో స్థానిక సీఎస్ఐ సంఘాల ఆధ్వర్యంలో 9, 10, 11 తేదీల్లో సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు క్రైస్తవ ఉజ్జీవ మహాసభలు నిర్వహిస్తున్నట్లు సంఘాల ప్రతినిధులు తెలిపారు. గురువారం చర్చ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో సి రాములు, ఇమ్మానుయేలు, ఎస్ జాన్, పాల్ కొమ్మాలు తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి రాష్ట్రప్రభుత్వం పెద్దపీట

- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

మానకొండూర్, మే 8 (ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధికి రాష్ట్రప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని శ్రీనివాస్‌నగర్ గ్రామంలో గల కస్తూర్బాగాంధీ పాఠశాలలో మూడు కోట్ల 25 లక్షల రూపాయలతో చేపట్టే అదనపు తరగతి గదులు, మరుగుదొడ్లు, ప్రయోగశాల నిర్మాణానికి గురువారం భూమిపూజ నిర్వహించారు. భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యనందిస్తూ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నాయని అన్నారు. పేద విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం మండల పరిషత్తు కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 60 మంది లబ్ధిదారులకు రూ.16లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఎం ఓదెలు, వైస్ చైర్మన్ ఆర్ తిరుమల్‌రెడ్డి, తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంపీడీవో వరలక్ష్మి, కేజీబీవీ అధ్యాపక బృందం పాల్గొన్నారు.



కేజీబీవీలో అదనపు గది నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

తిమ్మాపూర్ (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అందించే సాయం పేదల పాటిట వరమని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. గురువారం మండలంలోని ఎల్ఎండీ కాలనీలో గల క్యాంప్ కార్యాలయంలో తిమ్మాపూర్ మండలానికి చెందిన 54 మందికి 14 లక్షల 91 వేల 500 రూపాయల విలువైన చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎస్ఎల్ గౌడ్, నాయకులు గోపు మల్లారెడ్డి, మోరపల్లి రమణారెడ్డి, శ్రీగిరి రంగారావు, మామిడి అనిల్‌కుమార్, కాల్వ మల్లేశం, కొత్త తిరుపతిరెడ్డి, పోలు రమేష్, రాము, తొర్తి అరవింద్, రాములు పాల్గొన్నారు.

మున్నూరుకాపు సంఘం మండల కార్యవర్గం

చొప్పదండి, మే 8 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి మండల మున్నూరుకాపు కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా మల్యాల మహేందర్, ఉపాధ్యక్షుడిగా మునిగాల తిరుపతి, కొత్త హనుమాండ్లు, ప్రధాన కార్యదర్శిగా అమిరిశెట్టి వెంకటేష్, సంయుక్త కార్యదర్శిగా పబ్బ శ్రీనివాస్, పెరుక శ్రీనివాస్, కోశాధికారిగా చుప్ప శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులుగా ఉప్పు కరుణాకర్, కటకం లక్ష్మయ్య, గాండ్ల విజయ్, జిల్లాల విజయ్, బచ్చు నర్సయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జిలు మడ్లపల్లి శ్రీనివాస్, పుల్కం గంగయ్య, కోల ప్రభాకర్, తోట కృష్ణ, గాండ్ల లక్ష్మణ్, గౌరవాధ్యక్షులు జక్కన్న, అంజయ్య, తోట కోటేష్, కొట్టె అశోక్, మునిగాల రాజేందర్, మల్లారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

వేములవాడ గోశాలకు గడ్డి వితరణ

గన్నేరువరం, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మైలారం గ్రామానికి చెందిన రైతులు కాదసి రవి, నాగవల్లి కొమురయ్య వారికి చెందిన రెండు ట్రాక్టర్ల గడ్డి కట్టలను వేములవాడలోని గోశాలకు వితరణ చేశారు. ఈ మేరకు గురువారం ట్రాక్టర్ల ద్వారా గడ్డి కట్టలను గోశాలకు తరలించారు. కార్యక్రమంలో తోట రాజేందర్, వరాల సంజీవ్, జీల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ సిందూర్ విజయవంతంతో శాంతి ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న రచ్చబండ వాకర్స్ సంఘ సభ్యులు

కరీంనగర్ స్పోర్ట్స్, మే 8 (ఆంధ్రజ్యోతి): పహల్గాం ఉగ్రవాద దాడికి ప్రతిచర్యగా భారత్ నిర్వహించిన ఆపరేష న్ సిందూర్ విజయవంతంతో జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియం రచ్చబండ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం శాంతియుత ర్యాలీ నిర్వహించా రు. ఎలాంటి సామాన్య ప్రజల ప్రాణనష్టం లేకుండా పాక్ ఆక్రమిత ప్రాంతాల్లో దాడిచేసి తొమ్మిది ఉగ్రవాద బంకర్ల ను, 80 మంది ఉగ్రవాదులను మట్టి కరిపించడం గొప్పవిషయమన్నారు. అంబేద్కర్ స్టేడియం నుంచి ప్రారంభమైన శాంతి ర్యాలీ చుట్టుపక్కల పలు వీధుల్లో కొనసాగింది. ఈ ర్యాలీలో రచ్చబండ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు నాంపల్లి నాగన్న, నీరుమల్ల శ్యాంసుందర్, కోశాధికారి టి బుచ్చన్న, దేవసాని రమేష్, 50 మంది వాకర్స్ పాల్గొన్నారు.

డ్రోన్ శిక్షణపై 'కిట్స్' యాజమాన్యం ఒప్పందం



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న కళాశాల సెక్రెటరీ, డ్రోన్ ల్యాబ్ సంస్థ ప్రతినిధులు

హుజూరాబాద్‌రూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగాపూర్ గ్రామంలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలోని విద్యార్థులకు డ్రోన్ శిక్షణ ఇచ్చేందుకు ఏరోవిజన్ డ్రోన్ ల్యాబ్ సంస్థ ప్రతినిధులు గురువారం కళాశాల యాజమాన్యంతో ఒప్పందం కుదుర్చుకుంది. ఒప్పంద వివరాలను కళాశాల సెక్రెటరి, మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్ వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ ఏఐసీటీఈ రూ. 50 లక్షల ఆర్థిక సహాయంతో గ్రామీణ యువతకు డ్రోన్ శిక్షణ ఇచ్చేందుకు ఏరో విజన్ డ్రోన్ ల్యాబ్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుందన్నారు. దేశవ్యాప్తంగా 31 కళాశాలలను ఎంపిక చేయగా అందులో కిట్స్ కళాశాల ఒకటనని తెలిపారు. ఈ శిక్షణ ద్వారా విద్యార్థులకు డ్రోన్ నిర్వహణ విధానంపై సంపూర్ణంగా అవగాహన ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ కె. శంకర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఇంద్రనీల్, డ్రోన్ ల్యాబ్ ఇంచార్జీ డాక్టర్ ఎం.వి సతీష్‌కుమార్, అధ్యాపకులు తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి

శంకరపట్నం, మే 8 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలైన తమకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని శంకరపట్నం మండలం కరీంపేటలో కొందరు ప్రభుత్వాన్ని గురువారం వేడుకున్నారు. తమకు అర్హత ఉన్నా ఇళ్లు మంజూరు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోగా, గ్రామసభలో ప్రకటించిన ఇందిరమ్మ ఇళ్ల అర్హుల జాబితాలో తమ పేర్లు ఉన్నాయన్నారు. ఇటీవల ఇందిరమ్మ కమిటీ సభ్యులు ప్రకటించిన జాబితాలో తమ పేర్లు తొలగించారని ఆరోపించారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని అధికారులు, రాష్ట్ర ప్రభుత్వాన్ని వేడుకున్నారు.

బీజేపీ నాయకుల ప్రత్యేక పూజలు

శంకరపట్నం, మే 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శివాలయంలో గురువారం బీజేపీ మండలాధ్యక్షుడు ఏనుగుల అనిల్ ఆధ్వర్యంలో సైనికులకు, దేశ ప్రజలకు హాని జరగకుండా పాకిస్తాన్ ఉగ్రవాదులను యుద్ధంలో అంతమొందించాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాయకులు దొంగల రాములు, బిజిలి సారయ్య, పడాల వెంకటలక్ష్మి, బొజ్జ సాయిప్రకాష్, పురోహితులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

చిరుతల కళాకారులకు వస్త్రాల పంపిణీ

తిమ్మాపూర్, మే 8, (ఆంధ్రజ్యోతి): మండలంలోని మన్నెంపల్లి గ్రామానికి చెందిన 15 మంది చిరుతల కళాకారులకు గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ పొన్నం అనిల్‌గౌడ్ సొంత ఖర్చుతో కళాత్మక వస్త్రాలను కొనుగోలు చేసి గురువారం అందజేశారు. ఈ సందర్భంగా పొన్నం అనిల్‌గౌడ్ మాట్లాడుతూ కరీంనగర్‌లో 600 మంది కళాకారులు చిరుత ప్రదర్శన ఇవ్వడం గొప్పవిషయమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన 15 మంది కళాకారులు పాల్గొనడం హర్షణీయమని తెలిపారు.

ఉచిత మెగా వైద్య శిబిరం

భగత్‌నగర్, మే 8 (ఆంధ్రజ్యోతి): నేషనల్ మెడికల్ కౌన్సిల్ సూచనల మేరకు కుటుంబ దత్తత కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ వైద్య కళాశాల ఆధ్వర్యంలో కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శాంతన్‌కుమార్ పాల్గొన్నారు.